



## ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరావు కుటుంబానికి

# అండగా ఉంటాం

## ఎఫ్ఆర్ఓకు నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ తాతా మధు సూదన్

**ఖమ్మం బ్యూరో, నవంబర్ 23, కెరటం న్యూస్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలం బెండాలపాడు గ్రామం ఎర్రబోడు ఘటనలో మృతి చెందిన శ్రీనివాసరావు మృతదేహాన్ని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మంత్రి రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు రవిచంద్రతో కలిసి సందర్శించి భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడుతూ వారి కుటుంబానికి ముఖ్యమంత్రి కేసీఆర్ తరపున, ప్రభుత్వం తరుపున మరియు జిల్లా టిఆర్ఎస్ పార్టీ తరపున ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. శ్రీనివాస రావు ఆత్మకు శాంతి కలగాలని మధు ఆకాంక్షించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన శ్రీనివాసరావు కుటుంబానికి ముఖ్యమంత్రి కేసీఅర్ ప్రభుత్వం తరుపున రూ.50 లక్షలు, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఇంటి స్థలం ప్రకటించిందన్నారు. ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా ఆదుకుంటుందని భరోసా కల్పించారు. ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌తో పాటు రాష్ట్ర మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, పువ్వాడ అజయ్ కుమార్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, రాములు నాయక్, మెచ్చ నాగేశ్వర రావు, సీఎంఓ సెక్రటరీ స్మితా సబర్వాల్, హరితాహారం ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, అటవీ శాఖ స్పెషల్ సీఎస్ శాంతికుమారి, పీసీసీఎఫ్ (హెచ్ఓఎఫ్ఎఫ్) దోబ్రియల్, పీసీసీఎఫ్ (కంపా) లోకేష్ జైస్వాల్, కలెక్టర్ వీపీ గౌతమ్, కొత్తగూడెం ఎస్పీ వినీత్, ఇతర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు నాయకులు తదితరులు పాల్గొన్నారు



**వీడియోలు తీసినందుకే హత్యకు పాల్పడ్డారు...ఎస్పీ**

ప్లాంటేషన్‌లో పశువులను మేపుతున్న గొత్తికోయలను ఫారెస్టు రేంజర్ శ్రీనివాసరావు తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించడంతో గొత్తికోయలు వేట కొడవళ్లతో నరికి చంపారని భద్రాద్రి ఎస్పీ డాక్టర్ వినీత్ గంగన్న తెలిపారు. బుధవారం కొత్తగూడెంలోని ఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో చంద్రుగొండ ఫారెస్ట్ రేంజర్ శ్రీనివాసరావు హత్య కేసు నిందితులను చూపిస్తూ కేసు వివరాలను వెల్లడించారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్రుగొండ మండలం పోకలగూడెం ఫారెస్ట్ బీటు పరిధిలో జరుగుతున్న ప్లాంటేషన్ పనులను పరిశీలించేందుకు మంగళవారం ఎఫ్ఆర్వో చలమల శ్రీనివాసరావు వెళ్లారు. అక్కడి నుంచి బెండాలపాడు గ్రామ పంచాయతీ పరిధిలోని ఎర్రబోడు గొత్తికోయ గుంపునకు దగ్గరలోని ప్లాంటేషన్‌లో కొందరు పశువులను మేపుతున్నట్లు సదరు అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం వచ్చింది. దీంతో ఎఫ్ఆర్వో శ్రీనివాసరావు, ఎఫ్ఎస్వో తేజావత్ రామారావు తమ ద్విచక్రవాహనంపై సుమారు మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో అక్కడికి వెళ్లారు. అదే సమయంలో అక్కడ ఎర్రబోడు గొత్తికోయ గుంపునకు చెందిన మడకం తులా, పొడియం నంగా ఆ ప్రాంతంలో తమ పశువులను మేపుతున్నారు. ఇది గమనించిన సదరు అధికారులు మొక్కలు నాశనమవుతున్నాయని, పశువులను పక్కకు తీసుకువెళ్లి మేపుకోమని చెప్పారు. వారు వినకపోవడంతో ఆ దృశ్యాలను రేంజర్ శ్రీనివాసరావు తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించడం ప్రారంభించారు. దీంతో కోపోద్రేకానికి లోనైన తులా, నంగా ఎఫ్ఎస్వో రామారావుపై కర్రలతో దాడికి పాల్పడ్డారు. ఆ దాడిని అడ్డుకునే ప్రయత్నం చేసిన రేంజర్ శ్రీనివాసరావుపై గొత్తికోయలు 'మా వీడియోలు తీస్తావా' అంటూ ప్రతీకారంతో తమతో తెచ్చుకున్న వేటకొడవళ్లతో విచక్షణారహితంగా నరికారు. ఆ దాడిని ప్రత్యక్షంగా చూసిన రామారావు వెంటనే అక్కడి నుంచి తప్పించుకుని పై అధికారులను సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి హుటాహుటిన చేరుకున్న ఫారెస్ట్ అధికారులు రక్తపు మడుగుల్లో కొట్టుమిట్టాడుతున్న శ్రీనివాసరావుని కారులో చంద్రుగొండ పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం ఖమ్మంలోని కిమ్స్‌ని తరలించారు. కిమ్స్‌లో చికిత్స పొందుతున్న శ్రీనివాసరావు పరిస్థితి విషమించడంతో మృతి చెందారు. సెక్షన్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు చంద్రుగొండ పోలీసులు నిందితులపై 302, 353, 332 రెడ్ విత్ 34 ఐపీసీ సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. నిందితులు తులా, నంగా పోలీసుల కన్నుగప్పి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలో గల తమ స్వగ్రామానికి పారిపోతున్నట్లు పోలీసులకు సమాచారం తెలిసింది. దీంతో జూలూరుపాడు సీఐ వసంత్‌కుమార్ తన సిబ్బందితో కలిసి ఎర్రబోడు శివారులోని సీతారామ కాలువకట్ట వద్ద నిందితులను అదుపులోకి తీసుకుని వారి నుంచి హత్య సమయంలో ధరించిన దుస్తులతోపాటు, దాడికి వినియోగించిన వేట కొడవళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నిందితులను జుడీషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరచి కేసుని అన్ని కోణాల్లో విచారణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో కొత్తగూడెం డీఎస్పీ గుడ్ల వెంకటేశ్వరబాబు, జూలూరుపాడు సీఐ వసంత్‌కుమార్, చంద్రుగొండ ఎస్సై విజయలక్ష్మి, పీఆర్వో దాములూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమకారులను ఆదుకోవాలి..

**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా చైర్మన్ డాక్టర్ కె.వి కృష్ణారావు మాట్లాడుతూ దళిత బంధు మరియు డబల్ బెడ్ రూమ్ పథకాలు అమలు చేసే క్రమంలో తెలంగాణ ఉద్యమకారులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారులకు 20 శాతం దళిత, గిరిజన బంధు మరియు డబల్ బెడ్ రూమ్ లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. దళిత బంధు, డబల్ బెడ్ రూమ్ పథకాల అమలు పక్కదారులు పడుతున్నాయని దళారుల చేతిలోకి పోయి అర్హులైన వారికి అందకుండా పోతున్నాయని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమం కారుల ఫోరం దీనిని తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. ఇకనైనా ప్రభుత్వం కళ్లు తెరిచి 20 శాతం తెలంగా ఉద్యమకారులకు ప్రభుత్వ పథకాలలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ విస్మరించి తెలంగాణ ఉద్యమకారులకు అన్యాయం జరిగితే సహించేది లేదని ఉద్యమకారులంతా ఏకమై ఉద్యమ కార్య చరణను చేపడతామని హెచ్చరించారు. అలాగే ఎఫ్ఆర్ఓ శ్రీనివాస్ హత్య ప్రభుత్వ లోపమని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం ఇటు ప్రజలను అటు అధికారులను ఉసిగొలుపుతు వారి మధ్య వైరం పెంచుతూ ఇలాంటి హత్యలకు పాల్పడుతుందని ఆరోపించారు. ఇది ముమ్మాటికీ ప్రభుత్వ నిర్లక్ష్యమని, ఇలాంటి హత్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమం కారుల ఫోరం రాష్ట్ర నాయకులు పాలకుర్తి కృష్ణ, సీనియర్ ఉద్యమకారుడు గుంతేటి వీరభద్రం, తెలంగాణ ఉద్యమం కారుల ఫోరం ఖమ్మం నగర కన్వీనర్ రైస్ అన్వర్, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

